క్లుప్తంగా

డాక్టర్ అరుణ్‌కుమార్‌కు అంతర్జాతీయ పురస్కారం


డాక్టర్ అరుణ్‌కుమార్

అమలాపురం టౌన్: స్థానిక యేడిది సత్యనారాయణ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర మంగళపల్లి అరుణ్‌కుమార్‌కు అంతర్జాతీయ పురస్కారం లభించింది. బెంగళూరుకు చెందిన ఇనిస్టిట్యూట్ ఆఫ్ స్కాలర్స్, భూటాన్‌కు చెందిన గ్లోబల్ లీడర్స్ అసోసియేషన్‌లు సంయుక్తంగా నిర్వహించిన సదస్సులో డాక్టర్ విజయ్‌కుమయార్ పాల్గొన్నారు. బెంగళూరులో మంగళవారం జరిగిన ఈ సదస్సులో ఆయనను 'ఉత్తమ మేనేజ్‌మెంట్ అధ్యాపకుడు' పురస్కారానికి ఎంపిక చేశారు. భూటాన్ నుంచి ఆన్‌లైన్ ద్వారా ఆయన పురస్కారం అందుకున్నారు. డాక్టర్ అరుణ్‌కుమార్‌ను యేడిది సత్యనారాయణ కళాశాలల యాజమాన్యం, కోనసీమ జేఏసీ అభినందించాయి.

ఎమ్మెల్సీల పరామర్శ


ర్యాలి సోదరులను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీలు త్రిమూర్తులు, సూర్యనారాయణరావు

అమలాపురం టౌన్: అమలాపురం గారపాటి వీధికి చెందిన సోదరులు ర్యాలి వెంకట్రావు, బుజ్జిలను ఎమ్మెల్సీలు తోట త్రిమూర్తులు, కుడుపూడి సూర్యనారాయణరావులు బుధవారం పరామర్శించారు. మాతృ వియోగంతో బాధపడుతున్న వారికి ధైర్యం చెప్పి ఓదార్చారు. మృతి చెందిన జయలక్ష్మి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్సీల వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర ఉన్నారు.

టీడీపీ జెండా స్థూపాన్ని తొలగించాలి

మున్సిపల్ కమిషనర్‌కు దుకాణదారుల ఫిర్యాదు

అమలాపురం టౌన్: స్థానిక కాలేజీ రోడ్డులో పాలెపు రామచంద్ర టవర్స్ అపార్ట్‌మెంట్ గ్రౌండ్ ఫ్లోర్‌లోని దుకాణాలకు ఎదురుగా నిర్మించిన టీడీపీ జెండా స్థూపాన్ని తొలగించాలని మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్ప నాయుడికి జీవీఎల్ఎన్ శర్మ ఆధ్వర్యంలో దుకాణదారులు బుధవారం ఫిర్యాదు చేశారు. అలాగే ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణ రావుకు సైతం ఫిర్యాదు పత్రాన్ని అందజేశారు.

కేశనకుర్రులో ఉచిత వైద్య శిబిరం

ఐ.పోలవరం: గ్లోబల్ ఫౌండేషన్ దత్తత గ్రామమైన కేశనకుర్రుపాలెంలో బుధవారం సీతారామరాజు క్షత్రియ సేవా సమితి, కిమ్స్ ఆసుపత్రి సహకారంతో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో వైద్యులు వంశీ, నీలోఫర్, కె.అనూష, ఆర్.అన్నపూర్ణ, జె.ప్రియాంక, జె.శేఖర్‌లు 350 మంది రోగుల్ని పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో క్షత్రియ పరిషత్ అధ్యక్షుడు గాదిరాజు వెంకట సూర్యనారాయణరాజు, యావన్మంద లచ్చిరాజు, గాదిరాజు విశ్వనాథరాజు, పొత్తూరి సూర్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రం తనిఖీ

ముమ్మిడివరం: మండలంలోని తానేల్లంక గ్రామ సచివాలయంలో ఉన్న హెల్త్ సెంటర్‌ను కోనసీమ జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి ఎం.దుర్గారావు దొర బుధవారం తనిఖీ చేశారు. రోజువారి నివేదికను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలిచ్చారు. గ్రామంలో నిర్వహిస్తున్న లెప్రసీ కేసుల గుర్తింపు(ఎల్‌సీడీసీ) సర్వేను పరిశీలించారు. సర్వేలో సిబ్బంది తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన విధి విధానాలను వివరించారు. ఆయన వెంట ఎంపీహెచ్ఈఓ ఆర్.రామకృష్ణ, ఏఎన్ఎంఎస్‌లు, ఏఎస్‌హెచ్‌ఓలు పాల్గొన్నారు.

డిప్లమో విద్యార్థుల పారిశ్రామిక పర్యటన

కాట్రేనికోన: చెయ్యేరు శ్రీనివాస స్వయం ప్రతిపత్తి ఇంజినీరింగ్ కళాశాల డిప్లమో తృతీయ సంవత్సరం విద్యార్థులు పారిశ్రామిక పర్యటనలో భాగంగా తూర్పుగోదావరి జిల్లా రంగంపేటలో విజయ, విశాఖ పాల ఉత్పత్తి కేంద్రాలను సందర్శించారు. పాల ఉత్పత్తి కేంద్రాల్లో పాల సేకరణ, ఉత్పత్తి, నిల్వ ఉంచు విధానాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సీహెచ్‌వీఎస్ పరమేశ్వరరావు మాట్లాడుతూ ప్రత్యక్ష పరిశీలనతో నూతన ఆవిష్కరణలకు పునాది పడుతుందన్నారు. కరస్పాండెంట్ అండ్ సెక్రటరీ డీవీఎస్ఎన్ వర్మ, రమేష్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

చమురు సంస్థలకు పటిష్ట భద్రత

తాళ్లరేవు: రాష్ట్రంలోని కేజీ బేసిన్ పరిధిలోని ప్రతిష్ఠాత్మక సంస్థలైన రిలయన్స్ ఇండస్ట్రీస్, ఓఎన్జీసీ సంస్థలకు ఆంధ్రప్రదేశ్ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ సాయుధ సిబ్బందితో పటిష్ట భద్రత కల్పిస్తున్నట్లు జోన్ కమాండెంట్ డాక్టర్ కొండా నరసింహారావు తెలిపారు. ఇటీవలే ఏపీఎస్‌పీఎఫ్ రాజమండ్రి జోన్ కమాండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆయన బుధవారం రిలయన్స్ ఇండస్ట్రీస్, ఓఎన్జీసీ ప్లాంట్లను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా సంస్థల అధికారులు కమాండెంట్ నరసింహారావును మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అసిస్టెంట్ కమాండెంట్ బసవా శ్రీనివాసరావు, ఇన్‌స్పెక్టర్ లక్ష్మయ్య, ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ పాల్గొన్నారు.

వలంటీర్లు కాదు.. వారియర్లు..

- ప్రజా సేవలో క్రియాశీలక పాత్ర
- లబ్ధిదారుల మదిలో నిలిచిన వలంటీర్లు

ఐ.పోలవరం/తాళ్లరేవు/ఉప్పలగుప్తం/కాట్రేనికోన: ప్రభుత్వం ప్రవేశపెట్టిన వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచింది. వలంటీర్ల సేవలను ఇతర రాష్ట్రాలు సైతం మెచ్చుకున్నాయి. సేవే పరమావధిగా భావిస్తున్న వలంటీర్లు నామమాత్రపు గౌరవ వేతనంతో ప్రజలకు వెలకట్టలేని సేవలందిస్తున్నారు. సంక్షేమ పథకాలను అర్హుల ఇళ్లకు చేర్చడంలో వలంటీర్లు క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారు. అటువంటి వలంటీర్లపై పవన్‌కల్యాణ్ చేసిన వ్యాఖ్యలపై వలంటీర్లే కాదు సామాన్య ప్రజానీకం సైతం మండిపడుతున్నారు. వలంటీర్లే లేకపోతే ఇంత పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలు తమ దరికి చేరడం సాధ్యమయ్యేది కాదంటున్నారు. సంక్షేమ సారథులుగా వలంటీర్లు అందిస్తున్న సేవలపై సామాన్య ప్రజానీకం వెల్లడిస్తున్న అభిప్రాయాలివీ..

వలంటీర్ సహకారం మరవలేను



ఈ ఫొటోలో కూరగాయలు, పాలు అందజేస్తున్న యువతి వలంటీరు దుర్గాభాయి. గతేడాది వరదల సమయంలో ఐ.పోలవరం మండలం కొమరగిరి పరిధి గట్టువానిపేటకు చెందిన పెయ్యల ధర్మరాజు ఇంటి చుట్టూ వరద నీరు చుట్టుముట్టింది. ఆ సమయంలో వలంటీర్ దుర్గాబాయి వారం రోజుల పాటు అధికారులు, దాతలు అందించిన వివిధ రకాల నిత్యావసర సరకులు, కూరగాయలు, పాలు, పండ్లు ఇంటికి తీసుకొచ్చి ఇచ్చారు. ఆపద సమయంలో వలంటీర్ తమకు అందించిన సహకారాన్ని మరిచిపోలేనని ధర్మరాజు చెబుతున్నారు.

కొండంత అండగా



నిస్సహాయ స్థితిలో ఉన్న మా కుటుంబానికి మా ప్రాంత వలంటీర్ జగతాని శ్రీతేజ కొండంత అండగా నిలిచింది. నాకు వికలాంగ పింఛన్ వచ్చేలా చేసింది. వైఎస్సార్ చేయూత నందించి సాయం చేసింది. గృహ రుణాన్ని అందేలా చేసి మాకు నిలువ నీడ కలిగేలా చేసింది. ప్రభుత్వం ద్వారా వచ్చే ప్రతి పథకాన్ని ఎప్పటికప్పుడు మాకు తెలియజేసి మాకెలాంటి శ్రమ లేకుండా అందేలా చూస్తుంది. కన్నబిడ్డల కంటే ఎక్కువగా మా యోగక్షేమాలు చూసుకుంటుంది.

– సూరంపూడి పద్మ, పాతకోరంగి

లాక్‌డౌన్ సమయంలో..



మా అబ్బాయిలు హైదరాబాద్‌లో ఉంటున్నారు. వారిని చూడటానికి హైదరాబాద్ వెళ్లి లాక్‌డౌన్ సమయంలో అక్కడ చిక్కుకుపోయాను. అనంతరం కరోనా వల్ల గ్రామానికి రావడానికి భయపడ్డాను. ఆ సమయంలో మా వలంటీర్ కేసనకుర్తి కనకదుర్గాదేవి హైదరాబాద్ వచ్చి నాతో పాటు మరో ఆరుగురికి పింఛన్ అందజేసింది. అది ఎప్పటికీ మరువలేం.

– మామిడికుదురు సుబ్బారావు, కూనవరం, ఉప్పలగుప్తం మండలం

ఆసుపత్రిలో పింఛను



గత ప్రభుత్వ హయాంలో పింఛన్ కోసం రోజుల తరబడి పడిగాపులు పడాల్సి వచ్చేది. జగన్ అధికారంలోకి వచ్చాక వలంటీర్లు ప్రతి నెలా ఒకటో తేదీ తెల్లవారేసరికే ఇంటికొచ్చి మరీ పింఛన్ అందజేస్తున్నారు. వలంటీర్లు అందిస్తున్న సేవలు చిరస్మరణీయం. నేను కాకినాడ మెడికవర్ ఆసుపత్రిలో గుండె శస్త్రచికిత్స చేయించుకున్నాను. మా వలంటీర్ లంకే దుర్గాభవాని కాకినాడ ఆసుపత్రికి వచ్చి ఐసీయూలో ఉన్న నాకు పింఛన్ అందజేసింది.

– ఓలేటి నాగేశ్వరరావు, గచ్చకాయలపోర, కాట్రేనికోన పంచాయతీ

ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్
- పల్లిపాలెంలో గడప గడపకూ మన ప్రభుత్వం


పల్లిపాలెం గడప గడపకూ కార్యక్రమంలో ఎమ్మెల్యే పొన్నాడ తదితరులు

ముమ్మిడివరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో ప్రభుత్వం ప్రజల ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలను అందిస్తుందని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీ పల్లిపాలెం సచివాలయ పరిధిలో బుధవారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయ, వలంటీర్ వ్యవస్థలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. అయితే ప్రతిపక్ష నాయకులు వలంటీర్లపై అనుచితంగా వ్యాఖ్యాలు చేస్తూ వారి మనోభావాలను దెబ్బతీస్తున్నారన్నారు. కోవిడ్ వంటి విపత్కర సమయంలో అయినవారే దగ్గరికి రావడానికి భయపడిన సమయంలో వలంటీర్లు ప్రాణాలకు తెగించి ప్రజలకు సేవలు అందించారన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, కౌన్సిలర్లు రెడ్డి హేమ సుందరి, దాసరి అన్నపూర్ణ, దాసరి శ్రీను, పార్టీ రాష్ట్ర కార్యదర్శి పెన్మత్సచిట్టిరాజు, పార్టీ టౌన్ కన్వీనర్ బొంతు సత్యశ్రీనివాస్, టౌన్ సచివాలయ కన్వీనర్ రెడ్డి శివన్నారాయణ, నగర పంచాయతీ కమిషనర్ జి.లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ సంచుల వాడకం ప్రమాదకరం


రాజీవ్ బీచ్ పరిశుభ్రతా కార్యక్రమంలో పాల్గొన్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

యానాం: ప్లాస్టిక్ వస్తువుల కన్నా ప్లాస్టిక్ సంచుల వాడకం ప్రమాదకరమని రీజినల్ అడ్మినిస్ట్రేటర్ మునిస్వామి పేర్కొన్నారు. బుధవారం స్థానిక రాజీవ్ బీచ్ పరిసర ప్రాంతాల్లో క్లీన్ యానాం-గ్రీన్ యానాం కార్యక్రమంలో భాగంగా డాక్టర్ ఎస్ఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-1 వలంటీర్లు బీచ్‌ను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆర్ఏఓ మునిస్వామి మాట్లాడుతూ వందలాది మంది పర్యాటకులు వచ్చే రాజీవ్ బీచ్‌లో ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించే కార్యక్రమం చేపట్టడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎస్పీ రఘు నాయగం, ప్రిన్సిపాల్ వరుగు భాస్కరరెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు ఎస్.శ్రీనివాస్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు పంట రుణాలు


కౌలు రైతులకు పంట రుణాలు కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏఓ సత్యనారాయణ

అల్లవరం: కౌలు రైతులకు సహకార బ్యాంకుల ఆధ్వర్యంలో పంట రుణాలను ఇవ్వడానికి బోడసకుర్రు గ్రామాన్ని రెండో పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశామని వ్యవసాయాధికారి ఎన్‌వీవీ సత్యనారాయణ అన్నారు. బోడసకుర్రు-1 సచివాలయంలో కౌలు రైతులకు పంట రుణాలపై బుధవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ఐదేళ్లుగా గ్రామంలో నివాసముంటూ 65 ఏళ్ల లోపు వయసున్న కౌలు రైతులు రుణం పొందే అవకాశం ఉందన్నారు. వీఆర్ఓ, వ్యవసాయ సహాయకుల ద్వారా ఎంపిక చేసిన కౌలు రైతులకు అల్లవరం సహకార బ్యాంకు ద్వారా పంట రుణాలు మంజూరు చేస్తామని చెప్పారు. వరినాట్లు పూర్తయిన తరువాత మొదటి విడతగా 25 శాతం, 50 రోజుల తరువాత మిగిలిన మొత్తాన్ని మంజూరు చేస్తారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి, వీఆర్ఓ జి.సత్యనారాయణ, ఉల్లీస్, ప్రసాద్, రొక్కాల నాగేశ్వరరావు, చింతం శ్రీను, రైతులు దొమ్మేటి రాధాకృష్ణ, బావన్న, గోపాలరావు పాల్గొన్నారు.

పవన్‌కల్యాణ్ దిష్టిబొమ్మ దహనం


పవన్‌కల్యాణ్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వలంటీర్లు

అమలాపురం టౌన్: వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ దిష్టిబొమ్మను బుధవారం స్థానిక 22వ వార్డులో వలంటీర్లు దహనం చేశారు. పవన్‌కల్యాణ్ వలంటీర్లకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. 22వ వార్డు కౌన్సిలర్ గొవ్వాల రాజేష్, ఆ వార్డు వలంటీర్లు నిరసనలో పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం: మండల కేంద్రం ఉప్పలగుప్తంలో వలంటీర్లు పవన్‌కల్యాణ్ దిష్టిబొమ్మను బుధవారం దహనం చేశారు. పవన్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అనంతరం పవన్ కళ్యాణ్ వాలంటీర్ల మనోభావాలు దెబ్బతినేలా మాట్లాడినందుకు చట్టపరంగా చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు కొంకి ఏడుకొండలు, చిక్కం బాలసుబ్రహ్మణ్యం, నిమ్మకాయల హనుమంతు శ్రీనువాస్, కోటుం లోవరాజు, పెయ్యల రమణ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో డీఈఓ అన్నపూర్ణ తనిఖీ


తాళ్లరేవు హైస్కూల్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ అన్నపూర్ణ

తాళ్లరేవు: మండల పరిధిలోని చొల్లంగి, పటవల, తాళ్లరేవు, నీలపల్లి హైస్కూల్స్‌తో పాటు చొల్లంగిపేటలోని సోషల్ వెల్ఫేర్ పాఠశాలను డీఈఓ కేఎంవీఎస్ అన్నపూర్ణ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యా కానుకల పంపిణీని పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. ప్రభుత్వం పంపిణీ చేస్తున్న యూనిఫాం, షూస్, బ్యాగులు, బెల్టులను విద్యార్థులు ప్రతిరోజూ వినియోగించేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలలో ఏర్పాటుచేసిన ఇంటరేక్టివ్ ప్యానెల్‌ను వెంటనే సిద్ధం చేసి ఉపయోగించేలా చూడాలని ఆదేశించారు. ఆమె వెంట కాకినాడ డివిజన్ ఉప విద్యాశాఖాధికారి ఆర్‌జేడీ రాజు, మండల విద్యాశాఖాధికారులు ఎ.మంగాయమ్మ, మోకా ఉమ తదితరులున్నారు.

జగనన్న సురక్షతో ఎంతో మేలు


లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ తదితరులు


లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ నాగేంద్రమణి


పత్తిగొందిలో మహిళకు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఎంపీపీ రాయుడు సునీత తదితరులు

ముమ్మిడివరం: ప్రజలకు జగనన్న సురక్షతో ఎంతో మేలు కలుగుతుందని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. నగర పంచాయతీ పల్లిపాలెం వార్డు సచివాలయంలో బుధవారం జరిగిన సురక్ష సభకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ధ్రువీకరణ పత్రాలు లేని కారణంగా పేదలు ప్రభుత్వ పథకాలకు దూరం కాకూడదని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందజేస్తుందన్నారు. అనంతరం లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, కమిషనర్ జి.లోవరాజు, జెడ్పీటీసీ కుడిపూడి శంకరరావు, వైస్ చైర్మన్లు వేటుకూరి బోసురాజు, రెడ్డి హేమ సుందరి, పెన్మత్స చిట్టిరాజు, తహసీల్దార్ చిక్కాల విజయశ్రీ, బొంతు సత్యశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

1448 సర్టిఫికెట్ల అందజేత

అమలాపురం టౌన్: స్థానిక 11, 12 వార్డు సచివాయాల పరిధిలోని మార్కెట్ ఏరియా, శ్రీరామ్ నగర్‌ల్లో బుధవారం జరిగిన జగనన్న సురక్ష శిబిరాల ద్వారా వివిధ సేవలకు సంబంధించి మొత్తం 1448 సర్టిఫికెట్లను ప్రజలకు అందజేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, పట్టణ పార్టీ అధ్యక్షుడు సంసాని బులినాని, కౌన్సిలర్లు గొవ్వాల రాజేష్, చిట్టూరి పెదబాబు ఆయా లబ్ధిదారులకు సర్టిఫికెట్లు ఇచ్చారు. జగనన్న సురక్ష ద్వారా అందుతున్న తక్షణ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని చైర్‌పర్సన్ సత్యనాగేంద్రమణి సూచించారు. ఆయా కార్యక్రమాల్లో మున్సిపల్ ఆర్వో శిరిగినీడి శివాజీ, మేనేజర్ ఎంవీఎస్ఎస్ మూర్తి, టీపీవో ఎం.తిరుపతిరావు పాల్గొన్నారు.

684 మందికి ధ్రువీకరణ పత్రాలు

తాళ్లరేవు: బుధవారం పి.మల్లవరం పంచాయతీ పత్తిగొంది సచివాలయం వద్ద జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ఎంపీపీ రాయుడు సునీత, జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్, ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణలు హాజరై 684 మంది లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అందని అర్హులైన పేదలను గుర్తించి వారికి తక్షణమే న్యాయం చేయాలనే ఉద్దేశంతో జగనన్న సురక్ష కార్యక్రమం తీసుకొచ్చారని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ దున్నా సత్యన్నారాయణ, వైస్ ఎంపీపీ ధూళిపూడి నాగేంద్రప్రసాద్, మాజీ జెడ్పీ చైర్మన్ దున్నా జనార్దనరావు, మండల సచివాలయాల కన్వీనర్ దున్నా శ్రీకాంత్, సూరిబాబు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కోపరేటివ్ సిబ్బంది దీక్ష


రిలే దీక్షల్లో మద్దతు తెలుపుతున్న వివిధ పార్టీల నాయకులు

యానాం: బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ స్థానిక ఆర్ఏఓ ఆఫీసు సమీపంలో కోపరేటివ్ స్టోర్స్ సిబ్బంది చేస్తున్న రిలే నిరాహార దీక్ష బుధవారం రెండో రోజుకు చేరుకుంది. అగ్నికుల క్షత్రియ సేవా సంఘం అధ్యక్షుడు శేరు కృష్ణ, అన్నాడీఎంకే అధ్యక్షుడు మంచాల సత్యసాయికుమార్, రాష్ట్ర బీసీ సేన ప్రధాన కార్యదర్శి మల్లాడి సత్తిబాబు, యానాం లయన్స్ క్లబ్ పిల్లారాయ అధ్యక్షుడు పులవర్తి శ్రీను, దళితనేత పొనుగుమట్ల విష్ణుమూర్తి తదితరులు దీక్షా శిబిరానికి వచ్చి తమ మద్దతు తెలియజేశారు. ప్రభుత్వం స్పందించి సిబ్బంది వేతనాల సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ అధ్యక్షుడు దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో తనిఖీలు


బాలురు గురుకులంలో భోజనాన్ని రుచి చూస్తున్న ప్రత్యేక అధికారి మూర్తి

అల్లవరం: జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశాల మేరకు గోడిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర, బాలికల గురుకులాల్లో మండల ప్రత్యేక అధికారి కన్నీడి మూర్తి బుధవారం ఆకస్మిక తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. బాలుర గురుకులంలో 20 మరుగుదొడ్లు, బాలికల హాస్టల్లో 10 మరుగుదొడ్లకు తలుపులు అవసరమని గుర్తించారు. బాలుర గురుకులంలో వాటర్ ట్యాంక్ వద్ద శుభ్రం చేయించాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు. అనంతరం విద్యార్థుల కోసం తయారుచేసిన భోజనాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. గురుకులాల్లో సమస్యలపై జిల్లా కలెక్టర్‌కు నివేదిక ఇస్తామని ప్రత్యేకాధికారి మూర్తి విలేకరులకు తెలిపారు. ఆయన వెంట ఎంపీడీఓ కృష్ణమోహన్, తహసీల్దార్ సాంబ శివప్రసాద్, తోట నరసింహరావు, ప్రిన్సిపాల్ శ్యామ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

మంత్రి విశ్వరూప్ తనయుడు శ్రీకాంత్


చిందాడగరువు గడప గడపకూ కార్యక్రమంలో పినిపే శ్రీకాంత్

అమలాపురం రూరల్: గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజా సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ తనయుడు డాక్టర్ పినిపే శ్రీకాంత్ అన్నారు. మండలంలోని చిందాడగరువులో బుధవారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరించారు. బూలవారిపేటలో డ్రైన్‌తో పాటు రోడ్డు నిర్మించాలని స్థానికులు కోరారు. ఈ సందర్భంగా పినిపే శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రజల ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో సెంట్రల్ డెల్టా బోర్డ్ చైర్మన్ కుడుపూడి వెంకటేశ్వరరావు, సర్పంచ్ పోనకల గణేష్, ఎంపీటీసీ రేవు శ్రీనుబాబు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బొంతు గోవింద్ శెట్టి, మంగళంపల్లి అంజిబాబు, శీలం సాయిరామ్, బండి ధర్మ, మట్ట నాగబాబు, రేవు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

కాట్రేనికోన: పితృవియోగంతో బాధపడుతున్న వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ కన్వీనర్ సాక బాలరాజును లక్ష్మివాడలో ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ బుధవారం పరామర్శించారు. బాలరాజు తండ్రి వెర్రియ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. పరామర్శించిన వారిలో నడింపల్లి సూరిబాబు, నల్లా నరసింహమూర్తి, చొల్లంగి వెంకటేశ్వరరావు, బీర ధనుంజయ్ తదితరులున్నారు.

వృద్ధురాలి ఆత్మహత్యాయత్నం

అమలాపురం రూరల్: ఇంటి స్థలం కోసం వృద్ధురాలు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన కామనగరువులో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రాజులపూడి వెంకటేశ్వరరావు కాలనీలో చిటికెన లోవలక్ష్మికి ఇంటి పట్టా ఇచ్చారు. ఆ స్థలాన్ని దాసరి రాఘవమ్మ ఆక్రమించుకుని ఇంటి నిర్మాణం చేపట్టినట్లు లోవలక్ష్మి అధికారులకు ఫిర్యాదుచేసింది. దీనిపై తహసీల్దార్ పరమట శ్రీపల్లవి సమక్షంలో అధికారులు బుధవారం విచారణ చేపట్టి స్థలం లోవలక్ష్మిదేనని నిర్ధారించారు. దీంతో నాకు అన్యాయం చేస్తారా అంటూ రాఘవమ్మ పురుగుల మందు తాగేందుకు ప్రయత్నించగా అధికారులు, ఆమె కుటుంబసభ్యులు అడ్డుకున్నారు. రాఘవమ్మ అమలాపురం ఏరియా ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేరింది. ఆమె పురుగుల మందు తాగలేదని సూపరింటెండెంట్ డాక్టర్ శంకరరావు నిర్ధారించారు. ఘటనపై విచారణ చేసి రాఘవమ్మపై ఆత్మహత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు అమలాపురం ఎస్ఐ అందే పరదేశీ తెలిపారు.

సీఎం జగన్‌ను కలిసిన మల్లాడి


ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన మల్లాడి కృష్ణారావు

యానాం: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో జరిగిన సమావేశంలో యానాంకు సంబంధించి పలు సమస్యలను ఆయన వద్ద ప్రస్తావించారు. బీసీల సమస్యలను పరిష్కరించాలని, బీసీ కులాల కార్పొరేషన్‌లకు నిధులు కేటాయించాలని, బీసీ కులగణన చేయాలని కోరారు. ఈ సందర్భంగా సీఎం జగన్‌ను దుశ్శాలువాతో సత్కరించారు.

శ్మశానవాటిక పనుల పరిశీలన

ఉప్పలగుప్తం: మండలంలోని గొల్లవిల్లి శ్మశానవాటికలో దట్టమైన తుప్పలు పెరిగిపోవడంతో ఇటీవల కాలంలో అంత్యక్రియలు నిర్వహించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గ చొరవ చూపి ఉపాధి కూలీలచే తుప్పలు తొలగించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. గత రెండు రోజులుగా శ్మశాన వాటికలో నిర్వహిస్తున్న తుప్పల తొలగింపు పనులను బుధవారం సర్పంచ్ శ్రీదుర్గ పరిశీలించారు. ఆమె వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు సుంకర బుజ్జి, జొన్నాడ చిన్ని తదితరులున్నారు.

బీజేపీ జిల్లా శాఖ కార్యాలయం ప్రారంభం

అమలాపురం రూరల్: అమలాపురం యర్రమిల్లివారి వీధిలో నూతనంగా ఏర్పాటు చేసిన బీజేపీ జిల్లా శాఖ కార్యాలయాన్ని బుధవారం ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని జిల్లాల్లో బీజేపీ కార్యాలయాలు ఏర్పాటు చేస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ బలోపేతానికి గ్రామ స్థాయి నుంచి పార్టీని పటిష్టం చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కర్రి చిట్టిబాబు, మోకా వెంకట సుబ్బారావు, మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమా, ఆర్వీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వేలం పాట సరి కాదు

అమలాపురం టౌన్: అన్నవరం కొండపై శుభకార్యాలు చేయించుకునేందుకు పురోహితులను సరఫరా చేసేందుకు బహిరంగ వేలం పాట నిర్వహించడాన్ని తప్పుబడుతూ ఆంధ్రప్రదేశ్ పురోహిత బ్రాహ్మణ సమాఖ్య రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి భళ్లమూడి బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు.

భక్తుల మనోభావాలను దెబ్బతీసే ఇలాంటి నిర్ణయాలను దేవస్థానం అధికారులు ఉపసంహరించుకోవాలని కోరారు.